


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




శుక్రవారం 05-12-2025 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :185 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## రష్యాతో 2 బిలియన్ డాలర్ల సబ్‌మెరైన్ డీల్?

- ఈ క్రమంలో ఓ జలాంతర్గామి లీజుకు సంబంధించిన డీల్ కూడా ఖరారయ్యే అవకాశం ఉన్నట్లు పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.
- దీని విలువ దాదాపు రెండు బిలియన్ డాలర్లని తెలుస్తోంది.

పేజి 2లో

## ప్రతి మూడు ఇండిగో విమానాల్లో రెండు ఆలస్యం..!

- ఈ సంస్థకు చెందిన ప్రతి మూడు విమానాల్లో రెండు ఆలస్యంగా నడుస్తున్నాయి.

పేజి 2లో ▶

## ‘అదనపు సిబ్బందిని తీసుకోండి’.. బీఎల్‌వోల ఆత్మహత్యల వేళ ‘సుప్రీం’ సూచన

- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో బూత్ స్థాయి అధికారులు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.
- పలువురు బీఎల్‌వోలు అనారోగ్యానికి గురి కావడం, రాజీనామాలు చేస్తుండటం, పలువురు ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు కలవరపెడుతున్నాయి.

పేజి 2లో ▶

# ఆదిలాబాద్‌కు వరాల జల్లు



**ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌కు ఎయిర్‌బస్ తీసుకొస్తా: రేవంత్‌రెడ్డి**

- ఎయిర్‌పోర్టు నిర్మించి..పరిశ్రమలు రప్పిస్తాం
- యూనివర్సిటీ ఏర్పాటుకు తక్షణ హామీ
- సిమెంట్ పరిశ్రమను తెరిపించి యువతకు ఉద్యోగాలు
- రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన
- ఆదిలాబాద్ పర్యటనలో సిఎం రేవంత్ వెల్లడి

**రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన**



## దుష్ప్రచారం చేయడం జగన్‌కు ఆనవాయితీ: మంత్రి కొల్లు రవీంద్ర



2లో

- జగన్‌పై విమర్శలు: మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... దుష్ప్రచారం చేయడం వై.ఎస్. జగన్‌కు ఆనవాయితీగా వస్తోందని, ఆయన ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని విమర్శించారు.
- విషం చిమ్మే ప్రయత్నం: రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో ముందుకెళ్తుంటే, జగన్ విషం చిమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.
- నిందితుల సమర్థన: నకిలీ మద్యం కేసు నిందితుడు జోగి రమేశ్, పల్నాడు జంట హత్యల కేసు నిందితుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి లాంటి వారిని అద్భుత వ్యక్తులుగా చూపించడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు.

## రాచకొండ కమిషనరేట్ల పోలీసు వెబ్‌సైట్లలోకి మాల్‌వేర్..?



2లో

## ఐ బొమ్మ రవి పిటిషన్లపై ముగిసిన వాదనలు, తీర్పు రేపటికి వాయిదా




హైదరాబాద్: ఐ-బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి కస్టడీ పిటిషన్లపై కౌంటర్ దాఖలుచేసిన అతని తరఫు న్యాయవాదులు నాంపల్లి కోర్టులో వాదనలు వినిపించారు. ఇప్పటికే ఒక కేసులో రవిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు 8 రోజుల పాటు విచారించారని కోర్టుకు తెలిపారు.

పేజి 2లో ▶

## తెలుగు చదువుకుంటేనే ఉద్యోగాలు ఇస్తామనాలి : వెంకయ్య నాయుడు



2లో

- తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలు: ఇటీవల రామోజీరావు జయంతి సందర్భంగా, తెలుగు భాషలోనే ప్రభుత్వ కార్యక్రమాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు చేయాలని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరగా, వారు చేస్తామని హామీ ఇచ్చారు. ఇది రామోజీరావుకు ఘన నివాళి

## 77 డీడీవో ఆఫీసులు ప్రారంభం

**ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే గ్రామీణాభివృద్ధి శాఖ పని: పవన్**



**10 వేల మందికి పదోన్నతులు పంచాయతీరాజ్ పటిష్టానికి ఐటీ వింగ్ - పవన్ కల్యాణ్**

చిత్తూరు: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే గ్రామీణాభివృద్ధిశాఖ పని అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. చిత్తూరులో డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో) కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అదే కార్యక్రమంలో వివిధ జిల్లాల్లోని 77 డీడీవో కార్యాలయాలకు పవన్ వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

“77 డీడీవో ఆఫీసులు ప్రారంభించడం సంతోషంగా ఉంది. ప్రజలకు సేవలందించడానికి, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఇవి ఉపయోగపడతాయి. రాష్ట్ర వ్యాప్తంగా 10వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు అందించాం. పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టానికి ఐటీ వింగ్ ఏర్పాటు చేశాం”అని పవన్ అన్నారు.

2లో

## 5లక్షల కోట్ల భూ కుంభకోణంపై క్షేత్రస్థాయిలో పోరాడతాం:

- పారిశ్రామిక భూములను చౌకధరకు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు.
- పారిశ్రామిక భూముల బదలాయింపు అంశంపై బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న క్రమంలో, కేటీఆర్ జీడిమెట్ల పారిశ్రామికవాడలో హమాలీలతో మాట్లాడారు.
- ఆరు నెలలుగా భూముల దోపిడీ జరుగుతోందని, పాలసీ ఇప్పుడు బయటకు వచ్చిందని ఆయన పేర్కొన్నారు.
- పోరాటం, డిమాండ్: రూ. 5 లక్షల కోట్ల భూదోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, ఈ కుంభకోణంపై క్షేత్రస్థాయిలో పోరాడతామని, ప్రజల సొమ్ము ప్రజలకే దక్కాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్: పారిశ్రామిక భూములను చౌకధరకు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. పారిశ్రామిక భూముల బదలాయింపు అంశంపై భారత రాష్ట్ర సమితి నిజనిర్ధారణ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాయి.



పేజి 2లో ▶

# సంపాదకీయం

## ఆఖరి అంకంలో సాయుధ పోరాటం

హిడ్మా ఎన్‌కౌంటర్, పెద్ద ఎత్తున మావోయిస్టుల అరెస్టులు, లొంగుబాట్లతో పీపుల్స్‌వార్/ మావోయిస్టు పంథా ముగింపు దశకి వచ్చింది. చరిత్ర పునరావృతమైనట్లయింది. 1968లో విజయవాడలో తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి, కొల్లా వెంకయ్య తదితరుల నాయకత్వంలో వెలసిన ఏపీసీసీసీఆర్ ద్వారా సాయుధ పోరాట పంథాకు జరిగిన అంకురార్పణ శ్రీకాకుళం, వరంగల్, జగిత్యాల, ఇంద్రవెల్లి మీదుగా దేశమంతా పాకింది. ఈ క్రమంలో సీపీ గ్రూప్, పీపుల్స్‌వార్, లిన్‌పియావో/ రెడ్‌ఫ్లాగ్ (రవూఫ్), పైలా గ్రూప్, జీవీ గ్రూప్, ఫణిబాగ్చి వర్గం, కేఆర్ గ్రూప్, జనశక్తి, చలమన్న గ్రూప్, ఆర్‌వోసీ%-% అలా చీలికలు పీలికలవుతూ ఝార?ండ్ అడవుల్లోని ఎంసీసీతో కలిసిపోయింది. ఒక సమయంలో నేపాల్‌లోని ప్రచండ వర్గం నుంచి శ్రీలంకలోని ఎల్‌టీటీఈ వరకు సంబంధాలు పెట్టుకుని రెడ్ కారిడార్ ఏర్పరిచింది.

ఏదో ఒక నాటికి దుర్భేద్య స్థావరాలు అవసరమవుతాయనే కొండపల్లి సీతారామయ్య దూరాలోచన మేరకు వింధ్యారణ్యాల్లోని ఆదివాసీ ప్రాంతాల్లో వైద్యులు, టీచర్ల రూపంలో 1980ల నుంచే బేస్ ఏర్పరచుకున్నారు. ఆ స్థావరాలే ఇప్పటిదాకా ఉద్యమ నాయకత్వాన్ని కాపాడుకుంటూ వచ్చాయి. ఒకానొక సమయంలో అసలీ దావానలాన్ని ఆపగలమా అనే సందేహం పాలకవర్గాల్లో కలిగింది. కానీ ఊహించని స్థాయిలో విరుచుకుపడిన టెక్నాలజీ కారణంగా, ఆత్మరక్షణ వ్యూహాలతో ఉద్యమ విస్తరణ వెనుకబడడంతో సాయుధ పోరాటం చివరికొక అనాథలా ముగియడం సామాజిక విషాదం.

భారతదేశంలో సాయుధ పోరాటాలు, మావోయిస్టు పార్టీ పాత్రలపై ఏదో ఒక రోజు సమగ్ర చరిత్ర లిఖితమవుతుంది. ఈ ఉద్యమం మిగిల్చిన నెత్తుటి మరకలు, త్యాగాలు, అరాచకాలు, అన్నివైపులా జరిగిన ప్రాణనష్టం, క్రమేపీ కుంచించుకుపోయిన మేధావి వర్గం పోషించిన పాత్ర, జరిగిన వాగ్వాదాలు, పంథాల మధ్య ఘర్షణలు ఎలాగూ అక్షరాలకెక్కుతాయి. అరవయ్యేళ్ల సాయుధ పోరాట ఆలోచనా స్రవంతిలో, కీలక సమయాల్లో జరిగిన నిర్ణయాల గురించి విపులంగా పరిశోధిస్తే, తప్పొప్పులను తూకం వేసుకోవడమే కాక, రాబోయే తరాల ఆలోచనలకు ఒక దిక్సూచి దొరుకుతుంది.

చైనాను మావో నడిపిన రోజుల్లో ముందడుగు (గ్రేట్ లీప్ ఫార్వర్డ్), సాంస్కృతిక విప్లవం పేరిట జరిగిన అరాచక ఆలోచనలు, సాయుధ పోరాటాలని అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలకు ఎగుమతి చెయ్యాలన్న నిర్ణయంలో భాగంగా భారతదేశంలో సాయుధ పోరాటానికి పునాది వేసి, రాళ్లు పేర్చింది అప్పటి 'గ్యాంగ్ ఆఫ్ ఫోర్.' అలా విదేశీ ఉత్ప్రేరకాల మూలాలున్నప్పటికీ, చారు మజుందార్, వెంపటాపు సత్యం, కొండపల్లి సీతారామయ్య లాంటి అతి సాధారణ వ్యక్తులు అన్ని లక్షల మందిని సాయుధ విప్లవం వైపు, అజ్ఞాత జీవితం వైపు, త్యాగాలు, మరణాల వైపు నడిపించగలిగారంటే, అప్పటి ప్రధాన రాజకీయ స్రవంతి, పాలనా యంత్రాంగం, ప్రజల సమస్యలు, ఆలోచనల పట్ల ఎంత గుడ్డితనంతో వ్యవహరించాయో అర్థమవుతుంది.

మావో బతికుండగానే నక్సల్బరీ వసంత గర్జన కలకత్తా వీధుల్లో శవమై తేలింది. శ్రీకాకుళ రైతాంగ పోరాటం అనుకోకుండా జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌తో నిశ్శబ్దమైపోయింది. చంద్ర పుల్లారెడ్డి మరణానంతరం కూడా పరిమిత హింసతో ఆ గ్రూపు కొనసాగింది. కానీ పోలీసులతో తలపడడానికి, కవ్వింపు చర్యలకు దూరంగా ఉంది. కానీ వీటన్నిటికీ నేపథ్యంలో కొండపల్లి మొదలెట్టిన పీపుల్స్‌వార్ గ్రూప్ మొదటి నుంచీ దూకుడుతనాన్నే ప్రదర్శించింది. మరి గతంలో వచ్చి పోయిన పాలపొంగుల్ని, వాస్తవ విప్లవ పరిస్థితుల్ని సరిగ్గానే అంచనా వేసిందా? 1976లో మావో మరణానంతరం గ్యాంగ్ ఆఫ్ ఫోర్‌ని తరిమికొట్టి, డెంగ్ నాయకత్వంలో చైనా పూర్తిగా సంస్కరణవాదం వైపు మళ్లడాన్ని ఏ మాత్రం సరిగ్గా అర్థం చేసుకుంది? ఎమర్జెన్సీలో జరిగిన అణచివేతకు ప్రతీకారంగా యువ విప్లవకారులు అరాచక హత్యల వైపు మళ్లినప్పుడు మేధావి వర్గం ఏ మేరకు గైడ్ చేసింది? భారత రాజకీయాల్లో భార్గవ కమిషన్ల వాతావరణం శాశ్వతమనుకున్నారా?అతివాద, మితవాద వర్గాల ఘర్షణల్లో ప్రతిసారీ అతివాదులదే పైచేయి అయింది. అతివాదాన్ని సమర్థించే మేధావి వర్గ పరిమాణం కృశించిపోతుండగా, మితవాద మేధావులు క్రమేపీ విత్‌డ్రా అయిపోయారు. 1990 సోవియట్ యూనియన్ పతనం నుంచి నేర్చుకున్నదేమిటి? చరిత్ర గమనాన్ని గుర్తించారా? కొండపల్లిని బహిష్కరించడం, తర్వాత వరుసగా కర్నూలులో కన్నబీరన్, గుంటూరులో బాలగోపాల్ నిష్క్రమణ... సాయుధ పోరాటాన్ని ఏ దుస్సాహసాల వైపు నడిపించాయి?ఒక పక్క ఎన్నికలు బహిష్కరించమని పిలుపులిస్తూ, పోలింగ్ స్టేషన్ల మీద దాడులు చేస్తూ, బ్యాలెట్ బాక్సులు ధ్వంసం చేస్తూ, ఇంకో పక్క 1983, 85 ఎన్నికలలో ఎన్టీఆర్‌ను, 1989లో చెన్నారెడ్డిని, 1994లో మళ్లీ ఎన్టీఆర్‌ను సమర్థించి, 1999, 2004లో తెలుగుదేశానికి బద్ధ

## రాచకొండ కమిషనరేట్ల పోలీసు వెబ్‌సైట్లలోకి మాల్‌వేర్..?

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పోలీసు వెబ్‌సైట్లు వారం రోజులుగా పనిచేయడం లేదు. వీటిలోకి మాల్‌వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వెబ్‌సైట్‌ను క్లిక్ చేస్తే గేమింగ్ అప్లికేషన్‌కు రీడైరెక్ట్ అవుతున్నట్లు గుర్తించారు. సర్వర్లను డౌన్ చేసి వాటిని నిర్వహిస్తున్న ఎన్ఐసీకి సమాచారం అందించారు. సమస్యను పరిష్కరించేందుకు రెండు కమిషనరేట్లలోని ఐటీ బృందాలు యత్నిస్తున్నాయి. వెబ్‌సైట్ల పునరుద్ధరణకు ఎన్ఐసీ పర్యవేక్షణలో ప్రతినిధులు పనిచేస్తున్నారు. వాటి సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారు. మళ్లీ హ్యాకింగ్ కాకుండా అధునాతన ఫైర్‌వాల్స్‌ను ఐటీ బృందం సమీక్షిస్తోంది.

## తెలుగు చదువుకుంటేనే ఉద్యోగాలు ఇస్తామనాలి

మొదటి పేజీ తరువాయి

మచిలీపట్నం: తెలుగు చదువుకుంటేనే ఏపీ, తెలంగాణలో ఉద్యోగం ఇవ్వాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 'కృష్ణా తరంగ్ 2025' ఉత్సవాలకు ఆయన హాజరై మాట్లాడారు.

"ఇటీవల రామోజీరావు జయంతి సందర్భంగా తెలుగు భాషలోనే ప్రభుత్వ కార్యక్రమాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు చేయాలని ఈ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరాను. దీనికి వారు చేస్తామని హామీ ఇచ్చారు. ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో ఉంటే.. అదే రామోజీరావుకు ఘన నివాళి. భారతీయ భాషలను కాపాడాలని ప్రధాని మోదీ ఆలోచన చేస్తున్నారు. ఆంగ్లేయులు వారి భాషను అధికార భాషగా చేసుకుని పాలన చేశారు. మనం తెలుగు వాళ్లం కాబట్టి తెలుగును పరిపాలన భాషగా చేయాలి. మెడికల్, ఇంజినీరింగ్ బోధన మాతృభాషలో జరిగేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మన వాళ్లు ఇంగ్లీష్ మాట్లాడటం రాకపోయినా పేపర్ మీద రాసుకుని మాట్లాడతారు. ఆంగ్లంలో మాట్లాడితేనే గొప్ప అని భావిస్తున్నారు. ముందు మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వాలి.. తర్వాత సోదర భాషలు నేర్చుకోవాలి" అని వెంకయ్య నాయుడు అన్నారు.

## దుష్ప్రచారం చేయడం జగన్‌కు ఆనవాయితీ:

మొదటి పేజీ తరువాయి

మంగళగిరి: దుష్ప్రచారం చేయడం జగన్‌కు ఆనవాయితీగా వస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. జగన్ హయాంలో ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో ముందుకెళ్తుంటే విషం చిమ్మేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. మంగళగిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నకిలీ మద్యం కేసులో నిందితుడైన జోగి రమేశ్, పల్నాడు జంట హత్యల కేసులో నిందితుడైన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి లాంటి వారిని అద్భుత వ్యక్తులుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు.

" పరకామణి కేసు నిందితులను సమర్థిస్తూ భక్తుల మనోభావాలను జగన్ దెబ్బ తీస్తున్నారు. పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పించాలనే తపనతో కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. దుష్ప్రచారం చేస్తున్న జగన్‌ను ప్రజలు ఛీకొట్టి తరిమేశారు. గత ఐదేళ్లపాటు రైతులను పట్టించుకోని వైకాపాకి.. ఇప్పుడు వారి గురించి మాట్లాడే అర్హత లేదు. రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర రాక గతంలో తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు రైతు పండించిన పంట మిల్లర్లకు చేరిన 24 గంటల్లోగా నగదును వారి ఖాతాల్లో జమ చేస్తున్నాం" అని కొల్లు రవీంద్ర అన్నారు.

## 5లక్షల కోట్ల భూ కుంభకోణంపై క్షేత్రస్థాయిలో పోరాడతాం: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలో జీడిమెట్ల పారిశ్రామికవాడలో కేటీఆర్ పర్యటించి హమాలీలతో మాట్లాడారు. ఆరు నెలలుగా భూముల దోపిడీ జరుగుతోందని, పాలసీ ఇప్పుడు బయటికొచ్చిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీని కార్మిక సంఘాలు అడ్డుకోవాలన్నారు. రూ.5 లక్షల కోట్ల భూదోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజల సొమ్ము ప్రజలకే దక్కాలని డిమాండ్ చేశారు. "రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణంపై క్షేత్రస్థాయిలో పోరాడతాం. ఆషాఢం సేల్ వంటి ఆఫర్‌ను చూసి పారిశ్రామికవేత్తలు మోసపోవద్దు. రేవంత్‌రెడ్డి భూకుంభకోణంలో మీరు భాగం కావొద్దు. మా ప్రభుత్వం వచ్చాక ఆ భూములు వెనక్కి తీసుకుంటాం. రేవంత్‌రెడ్డి అవినీతి అనకొండ. దిల్లీకి మూటలు పంపేందుకు.. దోచుకునేందుకు కుట్ర చేస్తున్నారు. ఎవరి ప్రయోజనాల కోసం భూములను ధారాదత్తం చేస్తున్నారు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

## ఐ బొమ్మ రవి పిటిషన్లపై ముగిసిన వాదనలు, తీర్పు రేపటికి వాయిదా

మొదటి పేజీ తరువాయి

ఒకే రకమైన కేసులో మళ్లీ కస్టడీ కోరతున్నారని, నిందితుడికి బెయిల్ రాకుండా పోలీసులు చూస్తున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. తండేల్, కుబేర సినిమాల పైరసీ కేసులకు సంబంధించి మరింత సమాచారం సేకరించాలని పోలీసులు తెలిపారు. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం తీర్పు రేపటికి వాయిదా వేసింది. మరోవైపు రవి బెయిల్ పిటిషన్లపైనా వాదనలు ముగియడంతో తీర్పు రేపటికి వాయిదా పడింది.

## ఆదిలాబాద్‌కు వరాల జల్లు

మొదటి పేజీ తరువాయి

ఆదిలాబాద్ జిల్లాకు సిఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు ప్రకటించారు. ఎయిర్ పోర్టు, యూనివర్సిటీ, తుమ్మడిహట్టి ద్వారా నీళ్లు తీసుకొచ్చే బాధ్యత తనలదని ప్రకటించారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఏడాదిలోపు ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభిస్తామని వ్యాఖ్యానించారు. వరంగల్‌తో పాటు ఆదిలాబాద్‌కు అన్ని రకాల వసతులతో కూడిన ఎయిర్‌పోర్టు ఉండాల్సిందేనని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక్కడ ఎయిర్‌పోర్టు వస్తే ఆదిలాబాద్‌కు పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఎర్రబస్సే కాదని.. ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు కూడా తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఆదిలాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. అనంతరం ప్రసంగించారు. ఆదిలాబాద్ అభివృద్ధి బాధ్యత నేనే తీసుకుంటానని చెప్పుకొచ్చారు. ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్ బస్‌ను దించి.. పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారు. ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంటోంది. సంక్షేమం-అభివృద్ధి రెండుకళ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నాం. రెండేళ్లుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నా. చిన్న వయసులోనే నాకు గొప్ప అవకాశం దక్కడం.. ప్రజల దీవెన, దేవుడి సంకల్పం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాలకతీతంగా కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు విపక్ష ఎమ్మెల్యేలను ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా అనుమతించలేదు. ఎమ్మెల్యేలను కూడా సచివాలయంలోకి రాకుండా అడ్డుకున్న ప్రభుత్వాన్ని గత పదేళ్లలో చూశాం. ఏ ఆశయంతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో.. గత పదేళ్లలో అది నెరవేరలేదు. రాష్ట్ర అభివృద్ధికి తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంటరీ రూపొందించాం. పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈనెల 8, 9న గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం అని అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంద్రవెల్లి స్ఫూర్తిగానే గత ప్రభుత్వంపై నేను పోరాటం ప్రారంభించానని అన్నారు. అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరుల స్థూపం పర్యాటకంగా అభివృద్ధి చేసే దస్త్రంపై సంతకం పెట్టాను. ఆదిలాబాద్‌కు సాగునీరు అందేలా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును వైఎస్ఆర్ చేపట్టారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. మూడేళ్లకే కాళేశ్వరం కూలింది. ప్రజల సొమ్ము దోచుకుని అక్రమ సొమ్ము కోసం ఇవాళ ఆ కుటుంబంలో గొడవలు పడుతున్నారు. అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్దే నిర్మించి ఆదిలాబాద్‌కు నీరు ఇస్తాం. ఎన్నికల

ఉత్సవం పూర్తి కాగానే మరో 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తి చేస్తాం అని సీఎం హామీ ఇచ్చారు.తమ్మిడిహట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కట్టితీరుతామని స్పష్టం చేశారు.ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తానే వస్తానని తెలిపారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు ఉన్నాయని వివరించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిని పర్యాటక కేంద్రంగా మారుస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు మళ్లీ వస్తానని.... రోజంతా సమస్యలపై సమీక్షిస్తానని తెలిపారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యూనికేషన్‌లో ఆదిలాబాద్ అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఆదిలాబాద్‌లో తప్పకుండా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. వర్సిటీ ఎక్కడ కట్టాలో స్థానిక నేతలంతా కలిసి ఒక నిర్ణయానికి రావాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిలో యూనివర్సిటీ కడితే బాగుంటుందని తన భావన అని తెలిపారు. అనుమతి మాత్రమే తనదని.. ఎక్కడ కట్టాలో నిర్ణయం మీదేనని చెప్పుకొచ్చారు. ఏడాదిలో 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. రాబోయే రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. మన యువత ఐఏఎస్, ఐపీఎస్‌లు అయినప్పుడే తనకు సంతోషమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బాగా చదువుకుని తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటాలన్నారు. సర్పంచ్‌లను చూసి ఎన్నుకోవాలని, పనిచేసే వారికే అవకాశం ఇవ్వాలన్నారు.

రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, తదితరులు సభలో పాల్గొన్నారు.

## రష్యాతో 2 బిలియన్ డాలర్ల సబ్‌మెరైన్ డీల్?

మొదటి పేజీ తరువాయి



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన వేళ ఇరుదేశాల మధ్య పలు రక్షణ, వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఓ జలాంతర్గామి లీజుకు సంబంధించిన డీల్ కూడా ఖరారయ్యే అవకాశం ఉన్నట్లు పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీని విలువ దాదాపు రెండు బిలియన్ డాలర్లని తెలుస్తోంది.

ఈ జలాంతర్గామి కోసం దాదాపు పదేళ్లుగా చర్చలు జరుగుతున్నాయి. కానీ, ధర విషయంలో ఇన్నాళ్లు సయోధ్య కుదరలేదు. పుతిన్ పర్యటన వేళ ఈ చర్చలు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. రెండేళ్లలో రష్యా దాన్ని భారత్‌కు అందించనున్నట్లు సమాచారం. ఇటీవల భారత నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి మాట్లాడుతూ.. త్వరలో ఓ అటాక్ సబ్‌మెరైన్ సేవల్లోకి రానున్నట్లు తెలిపారు. నావికాదళంలో ఇప్పటికే ఉన్న రెండింటి కంటే అది పెద్దదని తెలిపారు. అంతకు మించి వివరాలేమీ వెల్లడించలేదు.

## ప్రతి మూడు ఇండిగో విమానాల్లో రెండు ఆలస్యం..!

మొదటి పేజీ తరువాయి




దేశంలోని కీలకమైన విమానయాన సంస్థ ఇండిగో సేవల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతోంది. ఈ సంస్థకు చెందిన ప్రతి మూడు విమానాల్లో రెండు ఆలస్యంగా నడుస్తున్నాయి. గత రెండు రోజుల్లోనే ఈ సంస్థకు చెందిన దాదాపు 300కు పైగా విమానాలు రద్దు కావడం గమనార్హం .

పౌర విమానయాన మంత్రిత్వశాఖ లెక్కల ప్రకారం.. ఇండిగో రోజుకు మొత్తం 2,200 విమానాలను నడుపుతోంది. వీటిల్లో డిసెంబరు 2న కేవలం 35% మాత్రమే సరైన సమయానికి నడిచాయి. ఇక అదేరోజు ఇండిగో కంటే మెరుగ్గా ప్రభుత్వ అధీనంలోని అలయన్స్ ఎయిర్ సంస్థ విమానాలే 38% సరైన సమయానికి ప్రయాణించాయి. ఇటీవల ఇండిగోకు సంబంధించిన విమానాలు రద్దీ అవడం, లేదా ఆలస్యం కావడం ఎక్కువయ్యాయి. వీటిలో దిల్లీ- ముంబయి, దిల్లీ- బెంగళూరు, ముంబయి- బెంగళూరు వంటి కీలక మార్గాల్లో ప్రయాణించేవే ఎక్కువగా ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. చిన్నచిన్న సాంకేతిక సమస్యలు, ప్రతికూల వాతావరణం, విమానాశ్రయాల్లో రద్దీతో పాటు సిబ్బంది కొరత వల్ల ఇలా జరుగుతుందని విమానయాన సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు.

100కు పైగా ఇండిగో విమానాల రద్దు

బుధవారం దిల్లీ ఎయిర్‌పోర్టులోనే దేశీయ, అంతర్జాతీయంగా నడిచే 38 ఇండిగో విమానాలు రద్దయ్యాయని అధికారులు తెలిపారు. ముంబయి విమానాశ్రయంలో కూడా దాదాపు 33 విమానాలది ఇదే పరిస్థితి అని వెల్లడించారు. మొత్తంగా గత రెండు రోజుల్లో దేశవ్యాప్తంగా 300కు పైగా విమానాలు రద్దయినట్లు పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఇండిగో ఓ ప్రకటనలో తెలిపింది. క్రమంగా తమ విమానాలు పునరుద్ధరించనున్నామని వెల్లడించింది. విమానాల రద్దు కారణంగా ప్రభావితమైన ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. 48 గంటల్లో తమ కార్యకలాపాలు సాధారణ స్థితికి వస్తాయని తెలిపింది. ఇక, విమానాల ఆలస్యం నేపథ్యంలో పౌర విమానయాన మంత్రిత్వశాఖ ఎయిర్ సేవా పోర్టర్‌లో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క రోజులోనే ఇండిగో సంస్థపై 100కు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. పైలట్ల కొరతే దీనికి ప్రధాన కారణమని డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తెలిపింది. కొనసాగుతున్న రద్దీలను పరిశీలిస్తున్నామని, సమస్యను పరిష్కరించేందుకు సంస్థతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొంది. దీనిపై విచారణ జరుపుతామని వెల్లడించింది.

## 'అదనపు సిబ్బందిని తీసుకోండి'..

### బీఎల్‌వోల ఆత్మహత్యల వేళ 'సుప్రీం' సూచన

మొదటి పేజీ తరువాయి



ఈ నేపథ్యంలో సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం కోర్టు కీలక సూచనలు చేసింది. బీఎల్‌వోల పని గంటలను తగ్గించేందుకు అదనపు సిబ్బందిని నియమించే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది.నిర్ణీత సమయంలో విధులు నిర్వర్తించనందుకుగానూ బీఎల్‌వోలపై బలవంతపు చర్యలు తీసుకోవద్దంటూ ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ నటుడు విజయ్‌కు చెందిన టీవీకే పార్టీ సుప్రీం కోర్టు ను ఆశ్రయించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. తీవ్ర పని ఒత్తిడి కారణంగా అనేక మంది బీఎల్‌వోలు మరణించారని, విధులు నిర్వర్తించడంలో విఫలమైతే వారిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారని టీవీకే తరఫు న్యాయవాది వాదించారు. ఈ నేపథ్యంలో కొన్ని సూచనలు జారీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఎల్‌వోలపై పని ఒత్తిడిని తగ్గించేందుకు అదనపు సిబ్బందిని నియమించడాన్ని రాష్ట్రాలు పరిగణించొచ్చని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు."బీఎల్‌వోలు పనిభారం, ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే.. రాష్ట్ర ప్రభుత్వం పరిష్కార చర్యలు తీసుకోవచ్చు. వారి పని గంటలు తగ్గించేందుకు అదనపు సిబ్బందిని తీసుకోవడాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు. ఎస్ఐఆర్ విధుల నుంచి తమను మినహాయించాలని ఎవరైనా కోరితే.. అటువంటి కేసులను విడివిడిగా పరిశీలించి, వారి స్థానంలో మరొకరిని భర్తీ చేయొచ్చు. ఎస్ఐఆర్ కోసం అవసరమైన సిబ్బందిని కేటాయించాల్సిన బాధ్యత సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై ఉంది. అవసరమైతే వారి సంఖ్య పెంచొచ్చు" అని సుప్రీం కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా 12 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రస్తుతం 'ఎస్ఐఆర్' ప్రక్రియ కొనసాగుతోంది. దాదాపు 5.32 లక్షల మంది బూత్ స్థాయి అధికారులు ఈ ప్రక్రియలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో బీఎల్‌వోలు తీవ్ర సవాళ్లు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ సహా పలు విపక్ష పార్టీల నేతలు ఈసీ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. బూత్ స్థాయి అధికారులపై పని ఒత్తిడి తీవ్రంగా ఉంటోందని, అందుకే అనారోగ్యం బారినపడుతున్నారని ఆరోపిస్తున్నారు.

# అనుముల రేవంత్ రెడ్డి కాదు.. అవినీతి అనకొండ: కేటీఆర్

**ఇది కద నిజం:**
హైదరాబాద్ నగరంలోని పారిశ్రామికవాడల్లో ఉన్న 5 లక్షల కోట్ల రూపాయల విలువైన భూములను దోచుకునే కుట్ర మీద పోరుబాట చేస్తూ ఈరోజు బిఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవ్వగా, కేటీఆర్ గతో పాటుగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు , సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి , పార్లమెంటరీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా ముఖంగా సీఎం రేవంత్ రెడ్డి తీరుపై మీడియా ముఖంగా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం %ఎ×ూూ% (హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫార్మేషన్ పాలసీ) పేరుతో 5 లక్షల కోట్ల రూపాయల భారీ భూ కుంభకోణానికి పాల్పడుతోంది. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలకు, పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారు. పరిశ్రమలు వద్దంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నారు. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేట్ వ్యక్తుల భూములు కావు. ప్రైవేట్ వ్యక్తులకు ప్రజల కోసం ప్రభుత్వం ఇచ్చిన భూములు. కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇవ్వడం జరిగింది. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే, ప్రభుత్వం కేవలం 4,000 రూపాయలకే ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తోంది. హైదరాబాద్ నగరంలో పేదలకు ఇండ్లకు, పాఠశాలలకు, ఆసుపత్రులకు, చివరికి స్మశానాలకు కూడా స్థలం లేదు. కానీ, ప్రైవేట్ వ్యక్తులకు 9,300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటోంది. ఈ 9,300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని, అక్కడ కాంగ్రెస్ చెబుతున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూల్స్, ఆసుపత్రులు కట్టాలి. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కాంగ్రెస్ కట్టలేదు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలివెళ్తే, హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుంది. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే ఈరోజు పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నాము. ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిగ్గుతేల్చాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నాము. ఈ అంశాన్ని ఇక్కడితో మా పార్టీ వదిలిపెట్టదు. %ఎ×ూ% (హిల్ట్) పాలసీ కుంభకోణం పైన త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తాము. నగరంలో కాలనీలలో ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తాము, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తాము. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతాము. ఈ పాలసీని వెనక్కి తీసుకొని, లక్షల కోట్ల విలువైవ ప్రజల భూమిని కాపాడే దాకా మా పోరాటం కొనసాగుతుంది. అవసరమైతే న్యాయపోరాటం చేస్తాము. మా ప్రభుత్వం రాగానే ఈ పాలసీని రద్దు చేస్తాము. అవసరమైతే ఇందుకోసం ఒక చట్టాన్ని



తీసుకువస్తాము. ఈరోజు రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేస్తున్నాము. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే, అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయన్న విషయాన్ని గుర్తుంచుకోండి. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక... తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న ఓ తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీ పైన మేము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయింది అంటూ ప్రభుత్వం బాధపడుతోంది. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీ పైన ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈరోజు మేము పర్యటిస్తున్న జీడిమెట్ల ప్రాంతంలో మార్కెట్ ధర గజానికి కనీసం లక్ష రూపాయలు ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం 4,000 రూపాయలకే పూర్తిగా భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని చెబుతోంది. ఒకవైపు 170 కోట్ల రూపాయలకు ఎకరం చొప్పున భూములు అమ్మిన ప్రభుత్వం అంటూ రోజు వార్తలు రాయించుకుంటున్న సర్కార్, మరోవైపు కేవలం కోటి రూపాయలకు ఎకరం చొప్పున జీడిమెట్లలో భూమిని ఎలా అమ్ముతుంది? ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుంభకోణానికి క్షేత్రస్థాయిలో ఉన్న నిదర్శనం. మేము గతంలో తెచ్చిన గ్రిడ్ పాలసీ ద్వారా కేవలం ఐటీ కార్యాలయాలు మాత్రమే నిర్మాణం చేసేందుకు అవకాశం ఉండేది. ఐటీ కార్యాలయాల ఏర్పాటు వలన ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా పెరుగుతాయి, పరోక్షంగా అనేకమందికి ఉపాధి లభిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, మా పాలసీ ఆదర్శం అయితే... ఈ పారిశ్రామిక భూములలో ఎలాంటి కాలుష్యం లేని పరిశ్రమలకు మాత్రమే తిరిగి భూములు కేటాయించాలి. ఐటీ వంటి పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు మాత్రమే అనుమతించాలి. అంతేకానీ అప్పనంగా అపార్ట్‌మెంట్లకు, విల్లాలకు ఇస్తామంటే కుదరదు. హైదరాబాద్ నగరం నుంచి కాలుష్య కారక పరిశ్రమలను బయటకి పంపించాలన్నది అందరి ఉద్దేశం. అందుకే ఎలాంటి పొల్యూషన్ లేని అంతర్జాతీయ స్థాయి ఫార్మాసిటీని ఏర్పాటు చేశాము. దాన్ని కూడా రేవంత్ రెడ్డి తన రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వాడుకుంటున్నాడు. రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరుతో ఫార్మాసిటీ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. రేవంత్ రెడ్డికి తెలిసింది కేవలం రియల్ ఎస్టేట్ దందా మాత్రమే. అందుకే అక్కడ ఫార్మాసిటీలోనూ, ఇక్కడ పారిశ్రామిక భూముల్లోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అనంతరం జీడిమెట్ల పారిశ్రామిక లోని పలు పరిశ్రమలను సందర్శించి కార్మిక సమస్యలపై కార్మికులతో, పారిశ్రామిక వేత్తలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మద్దతు నాకే ఉంది: నక్క మల్లేష్ గౌడ్, వార్డు మెంబర్ అభ్యర్థి

**ఇది కద నిజం,క్యాసారం, పటాన్చెరు నియోజకవర్గం:**



గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా క్యాసారం గ్రామంలో ఎన్నికల ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి వార్డులో ప్రచారం ఊపందుకోగా ఐదో వార్డు నుంచి మెంబర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నక్క మల్లేష్ గౌడ్‌కు గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రజలు తనకు ఇస్తున్న ఆదరణను చూసి తాన విజయం ఖాయమని నక్క మల్లేష్ గౌడ్ ధీమాగా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నక్క మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ“ఈ వార్డు ప్రజలందరూ నాకు కుటుంబ సభ్యుల్లాంటివారు. గతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి, అందరికీ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాను. అందుకే ఈసారి వారు నన్నే గెలిపించాలని నిర్ణయించుకున్నారు,” అని అన్నారు. అలాగే, “వార్డు మెంబర్‌గా నన్ను గెలిపిస్తే గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వేగంగా పూర్తి చేస్తా. సర్పంచ్ గానీ, ఎమ్మెల్యే వరకూ సమస్యలు తీసుకెళ్లి ప్రత్యేకంగా పరిష్కరించే బాధ్యత తీసుకుంటా అని అన్నారు. ప్రజల అభివృద్ధి ప్రాధాన్యత నాదే,” అని హామీ ఇచ్చారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ మల్లేష్ గౌడ్ ప్రచారం మరింత వేగం పెంచింది. మద్దతుదారులు, గ్రామ పెద్దలు, యువత ఆయనతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. ఐదో వార్డులో ఈసారి గట్టి పోటీ ఉన్నప్పటికీ, ప్రజల నమ్మకం తనపై ఉందని మల్లేష్ గౌడ్ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. క్యాసారం గ్రామంలో వార్డు ఎన్నికల వాతావరణం కాస్త రాజకీయ వేడి పుట్టిస్తున్న వేళ, నక్క మల్లేష్ గౌడ్ పేరు చర్చనీయాంశంగా మారింది. ప్రజల మద్దతుతో ముందుకు సాగుతున్న ఆయన విజయం వైపు దూసుకుపోతున్నారని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# నవాబుపేట్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా టి. విజయ్ కుమార్ నామినేషన్

**ఇది కద నిజం,వికారాబాద్ జిల్లా, నవాబుపేట్:**



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నవాబుపేట్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా టి. విజయ్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామ అభివృద్ధి కోసం తన వంతు బాధ్యతగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా పని చేస్తానని తెలిపారు. రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వ సహకారంతో వచ్చే ఐదు సంవత్సరాల్లో గ్రామ పేద ప్రజలకు అనుకూలమైన అభివృద్ధి కార్యక్రమాలను తీసుకురావడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

సర్పంచ్ అభ్యర్థి ప్రకటించిన హామీల్లో
- గ్రామ దేవాలయాల అభివృద్ధికి సహకారం
- మహిళల వివాహానికి రూ.10,111 ఆర్థిక సహాయం
- వృద్ధులు, వికలాంగులకు పింఛన్లను బాధ్యతగా అందించడం
- గ్రామంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణ, విస్తరణ
- ప్రభుత్వ ఆరోగ్య బీమా సహా ప్రభుత్వ పథకాల అమలు
- గ్రామంలో మరణించిన కుటుంబాలకు రూ.5,000 ఆర్థిక సాయం
- అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు
- ప్రతి గల్లీకి సీసీ రోడ్ల నిర్మాణం
- యువతకు క్రీడా పరికరాలు అందజేయడం
- ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కృషి, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాల ఏర్పాటు.

గ్రామ అభివృద్ధి, పేదల సంక్షేమం, పారదర్శక పాలన తన లక్ష్యమని టి. విజయ్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

# వినూత్న పథకాలతో ప్రచారంలో దూసుకుపోతున్న నాగర్‌గూడ సర్పంచ్ అభ్యర్థి

**– గ్రామమంతా ఉచిత వైఫై ఏర్పాటు హామీ ప్రజల్లో చర్చనీయాంశం**

**ఇది కద నిజం, నాగర్‌గూడ:**
గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో కొత్త తరం ఆలోచనలను ముందుకు తెచ్చిన అభ్యర్థిగా సువర్ణ శ్రీనివాస్ గౌడ్ పేరు ప్రస్తావనలోకి వస్తోంది. సాధారణంగా సర్పంచ్ అభ్యర్థులు డ్రైనేజీ మరమ్మతులు, వీధి దీపాలు, శుభ్రమైన తాగునీటి సరఫరా,



రోడ్ల నిర్మాణం వంటి హామీలతో ప్రజలను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తారు. అయితే నాగర్‌గూడ సర్పంచ్ అభ్యర్థి శ్రీనివాస్ గౌడ్ మాత్రం తనను గెలిపిస్తే గ్రామమంతా ఉచిత వైఫై అందిస్తాను అని ప్రకటించడం గ్రామంలో కొత్త చర్చకు తెర తీసింది. డిజిటల్ యుగంలో ఇంటర్నెట్ ప్రత్యక్షంగా విద్య, ఉపాధి, వ్యాపారం, వ్యవసాయ రంగాల వరకు ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ఆయన ఇచ్చిన ఈ హామీ ప్రజల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్రామం మొత్తం ఫైబర్ నెట్ కనెక్టివిటీతో స్మార్ట్ విలేజ్‌గా అభివృద్ధి చేస్తానని, ప్రతి ఇంటికి ఉచితంగా ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే యువత చదువులు, ఆన్‌లైన్ సేవలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం సులభంగా చేరుతుందని శ్రీనివాస్ గౌడ్ ప్రచార సభల్లో చెబుతున్నారు. ఈ వినూత్న హామీతో ఆయన ప్రచారానికి ఊపందుకోగా, ముఖ్యంగా యువతలో ఆయనకు మంచి ఆదరణ లభిస్తోంది. సంప్రదాయ హామీలతో పోలిస్తే కొత్త తరహా ఆలోచనలు గ్రామాభివృద్ధికి తోడ్పడతాయన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నాగర్‌గూడ సర్పంచ్ ఎన్నికల పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.

# ఎం.ఎల్.ఏ. పద్మారావు గౌడ్ కు అయ్యప్ప సమాజం ఆహ్వానం



సికింద్రాబాద్ : లాలాపేట అయ్యప్ప భక్త సమాజం ప్రతినిధులు గురువారం సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ తో సమావేశమయ్యారు. సికింద్రాబాద్ లోని మోండా మార్కెట్ లోని ఆయన నివాసంలో పద్మారావు గౌడ్ ను కలుసుకొని లాలాపేట లో ఈ నెల 25, 27 తేదిల్లో నిర్వహించే మహా పడి పూజ, రథోత్సవ కార్యక్రమాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తుల సాధక బాధకాలను పద్మారావు గౌడ్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యువ నాయకుడు రామేశ్వర్ గౌడ్, ప్రతినిధులు శ్రీనివాస్ గౌడ్, అశోక్, ధనరాజ్, మహేష్, శ్రీను, జగన్, మల్లికార్జున్, పరశురాం, సునీల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రియల్ భూముల దారదత్తం అడ్డుకుంటాం : మాజీ హెూం మంత్రి మహ్మాద్ అలీ”

**ఇది కద నిజం, చార్మినార్, డిసెంబర్ :**
తన అనుంగుల కోసం నగరంలోని ఇండస్ట్రియల్ భూములను దారదత్తం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుని తీరుతామని రాష్ట్ర మాజీ హెూం మత్రి మహ్మామూద్ అలీ హెచ్చరించారు. గురువారం ఆయన బహదూరుర నియోజకవర్గంలోని దూద్బౌలి ప్రాంతంలో కొనసాగుతున్న ఇండస్ట్రియల్ ఏరియాలో పలువురు సీనియర్ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పరిశ్రమల్లో విధులు కొనసాగిస్తున్న శ్రామికులతోపాటు వ్యాపారస్థులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పరిశ్రమలను కొనసాగిస్తున్న పలువురు వ్యాపారస్తులు ఎలాంటి ముందస్తు ఏర్పాట్లు లేకుండా నగర శివారు ప్రాంతాలకు తరలించడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని తమ భాదలను ఏకరువు పెట్టారు. అనంతరం శ్రావన్, మహ్మామూద్ అలీలు మాట్లాడుతూ ప్రత్యామ్నయ ఏర్పట్లు లేకుండానే నగరంలో కొనసాగుతున్న అనేక పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు



వెళ్లిపోమ్మని చెప్పడం పారిశ్రామిక విచ్చనానికి పన్నాగం పనుతున్నారని తెలిపారు. తన అనుంగులం కోసం చేస్తున్న ఈ ప్రయత్నాల వల్ల వేలాది మంది జీవితాలను రోడ్డున వేస్తున్నారని వాపోయారు. తన అనుచరుల కోసం సీఎం చేస్తున్న కుటిల యత్నాలతో ఇండస్ట్రియల్ ఉత్పత్తి పడిపోవడంతోపాటు రాష్ట్రం దివాళతీస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లోని విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైద్రాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ పుస్తె శ్రీకాంత్ తోపాటు వక్స్ బోర్డు మాజీ చైర్మన్ సలీం, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు..

# రోశయ్యకు నివాళులు అర్పించిన శివసేనారెడ్డి

**ఇది కద నిజం, హైదరాబాద్:**



దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ స్వర్గీయ రోశయ్య వర్ధంతి సందర్భంగా ఎల్బీ స్టేడియంలో ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ శివసేనారెడ్డి పాల్గొని రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, కోచ్‌లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని రోశయ్య సేవలను స్మరించారు. ప్రజా నాయకుడిగా రాష్ట్రానికి, సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమంటూ అభివర్ణించారు.

# సీనియర్ వీడియో జర్నలిస్ట్ దామోదర్ మృతదేహానికి నివాళులు అర్పించిన కేటీఆర్



**ఇది కద నిజం, హైదరాబాద్:**
గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన సీనియర్ వీడియో జర్నలిస్ట్ దామోదర్ మృతదేహానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు నివాళులు అర్పించారు. దామోదర్ దేహాన్ని సందర్శించిన కేటీఆర్, పూలమాలలు అర్పించి అశ్రుపూర్వకంగా శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. ఈ దుఃఖ సమయంలో బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ సహకారం అందిస్తుందని, కుటుంబానికి అండగా ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. కేటీఆర్ వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద, పార్టీ నాయకులు క్రిశాంక్ తదితరులు కూడా పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పట్ల పోలీస్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం విడనాడాలి.

**- బాధితులకు 1.50 కోట్ల పెండింగ్ నష్టపరిహారం చెల్లించాలి.**
**- డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్**

**ఇది కద నిజం,**
సిద్దిపేట జిల్లాలో జరుగుతున్న ఎస్సీ,ఎస్టీలపై దాడులను అరికట్టడం లో పోలీస్, రెవెన్యూ అధికారులు విఫలం చెందుతున్నారని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఆరోపించారు.దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో గురువారం నాడు గజ్వేల్ అంబేద్కర్ భవన్ లోఎస్సీ,ఎస్టీ అత్యాచార బాధితుల ,సాక్షుల సమావేశం జరిగింది.
ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ,ఎస్టీలపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని అన్నారు ముఖ్యంగా మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్న పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు .అత్యాచారాల కు గురైన బాధితులు పోలీస్ స్టేషన్లను ఆశ్రయిస్తే ఎస్ హెచ్ ఓ లు సరైన కేసులు పెట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పోలీస్ కమిషనర్ జోక్యం చేసుకుంటే తప్ప నిందితులను అరెస్ట్ చేయడం లేదని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 81 మంది అత్యాచార బాధితులకు కోటి 50 లక్షల పెండింగ్



నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని వివరించారు బాధితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బాధితులకు చట్ట ప్రకారం పునరావసం కింద ఉద్యోగము పెన్షన్ ,పక్కా ఇల్లు ,భూ పంపిణీ చేయాలని కోరారు ఎస్సీ ఎస్టీల హక్కుల ఉల్లంఘన లపై ఎస్సీ ఎస్టీలు ఐక్యంగా ఉద్యమించాలని భారత రాజ్యాంగం ఆకాంక్షించిన స్వేచ్ఛ ,సమానత్వాన్ని సాధించాలన్నారు ఈ సమావేశంలో భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ముద్దాపూర్ మాదారం వడ్డేపల్లి అంబర్పేట పోచంపల్లి సింగాటం తదితర గ్రామాలు చెందిన అత్యాచార బాధితులతో పాటు డి బి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జాతీయ ప్రజా ఉద్యమాల వేదిక రాష్ట్ర నాయకులు జాన్ మైఖేల్, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు అపర్ణ,హేమలత దళిత ఉద్యోగుల సంఘం నాయకులు ఎల్లయ్య డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, ముస్లిం హక్కుల సంఘం నాయకులు కాశీం, న్యాయవాది బత్తుల రాజు తదిరులు పాల్గొన్నారు.

# లైఫ్ లైన్ తులసి హాస్పిటల్‌లో అరుదైన థైరాయిడ్ సర్జరీ

**- లైఫ్ లైన్ తులసి హాస్పిటల్ ఛైర్మన్, చీఫ్ సర్జన్ డా. జె.ఎస్. రాజ్ కుమార్**

**ఇది కద నిజం,**
ఈ.సి.ఐ.ఏల్ లైఫ్ లైన్ తులసి హాస్పిటల్‌లో వైద్యులు మరో అరుదైన, అత్యాధునిక శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి వైద్య రంగంలో తమ ప్రతిభను మరోసారి చాటుకున్నారు. 60 ఏళ్ల వయస్సున్న ఒక వ్యక్తి గొంతులో థైరాయిడ్ సమస్యతో ఆసుపత్రికి రాగా, అన్ని విస్తృత పరీక్షలు నిర్వహించిన అనంతరం నోటిద్వారా ఎండోస్కోప్ సహాయంతో బయట ఎలాంటి కట్స్, సిజరింగ్ లేకుండా "ట్రాన్స్ ఓరల్ ఎండోస్కోపిక్ థైరాయిడ్ వెస్టిబ్యులర్ విధానం" (టోయిఇట్వా)పద్ధతిలో




థైరాయిడ్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. సాధారణంగా ఈ తరహా ఆపరేషన్లు చేయాలంటే ఎంతో అనుభవం, నైపుణ్యం కలిగిన వైద్యులు అవసరం. అలాంటి అరుదైన శస్త్రచికిత్సను ఈస్ట్ హైదరాబాద్‌లో కేవలం లైఫ్ లైన్ తులసి హాస్పిటల్‌లో మాత్రమే నిర్వహించడం గర్వకారణం అని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది.ఈ శస్త్రచికిత్స అనంతరం పేషెంట్ 24 గంటలలోనే లేచి నడవడం ప్రారంభించడం వైద్య బృందానికి మరింత ఆనందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా లైఫ్ లైన్ తులసి హాస్పిటల్ ఛైర్మన్, చీఫ్ సర్జన్ డా. జె.ఎస్. రాజ్ కుమార్ మాట్లాడుతూ.. (టోయిఇట్వా) పద్ధతిలో నోటిద్వారా థైరాయిడ్ సర్జరీ చేసి పేషెంట్‌కు బయట ఎలాంటి మచ్చలు లేకుండా వేగంగా కోలుకునేలా చేయడం అత్యంత సంతోషకరం. ఇది మా ఆసుపత్రి వైద్య బృందం సమష్టి కృషికి ప్రతిఫలం. ఈ విజయంతో ఈస్ట్ హైదరాబాద్ ప్రజలకు మరింత మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించగలుగుతాం అన్నారు. ఈ వైద్య పరీక్షల ఆపరేషన్‌లో డా. జె.ఎస్. రాజ్ కుమార్‌తో పాటు డా. కల్నల్ కె.ఆర్. రావు, డా. కరుణాకర్, డా. ప్రఫుల్, డా. భార్గవ పాల్గొన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో పాటు అనుభవజ్ఞులైన వైద్యుల సేవలతో లైఫ్ లైన్ తులసి హాస్పిటల్ ఈ ప్రాంత ప్రజలకు విశ్వసనీయమైన వైద్య సేవలు అందిస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.

# బండారి లేఔట్ అసోసియేషన్ ఎలక్షన్ పారదర్శకంగా జరగాలి

**- గత మూడు పర్యాయాలు కూడా నేనే ప్రెసిడెంట్ అని అనుకోవడం జరిగింది ?**
**- కొద్దిమంది వాళ్ళ అనుచరులతో కలిసి ఎన్నుకోవడం జరిగింది**
**- అలా కాకుండా ఒక పద్ధతి ప్రకారం కాలనీ వాసులందరికీ పిలిచి సెలెక్ట్ చేసుకుంటే సంతోషదాయకం అంటున్న కాలనీవాసులు**

**ఇది కద నిజం,**
నిజాంపేట్ బండారి లేఔట్ లో అసోసియేషన్ ఎలక్షన్స్ శాంతి, పారదర్శకత, న్యాయం ఉండాలంటే ఎన్నికలు సరైన విధంగా జరగాలి. అందుకు ఈ క్రింది విధానాన్ని పాటించడం మంచిది అని బండారిలేఔట్ కాలిని వాసుల ఆవేదన 1. ఎలెక్షన్ కమిటీ ఏర్పాటు రాజకీయ సంబంధం లేని 3-5 మంది నిష్పక్షపాత వ్యక్తులతో కమిటీ ఏర్పాటు చేయాలి.వారు మొత్తం ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారు.
2. సభ్యుల జాబితా తయారు చేయడం కాలనీలో నమోదు చేసిన అన్ని ఓటర్ల హౌస్ ఓనర్స్ ఎస్ ఫర్ బైలాస్ లిస్ట్ తయారు చేసి, నోటిస్ బోర్డుపై పెట్టాలి. ఎవరైనా పేరు లేదంటే సరిచేసే అవకాశం ఇవ్వాలి. 3. పోస్టుల ప్రకటన ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ లాంటి పదవులను ప్రకటించాలి. 4. నామినేషన్ ప్రక్రియా ఆసక్తి ఉన్న వారు నామినేషన్ ఫారమ్ నింపాలి. ప్రతి అభ్యర్థికి ఒకటి లేదా రెండు ప్రపోజర్లు ఉండేలా నిబంధన పెట్టాలి. 5. ప్రచారం (క్యాంపెయిన్) పరిమితులు మీరు చేసే కాలనీకి సహాయం ఏ విధంగా ఉంటుంది అభ్యర్థులు చెప్పాలి, ఏ గవర్నమెంట్ ఉన్న కొన్ని పనులు దానంతక అయ్యే జరుగుతాయి అవి నేనే చేసినా అని చెప్పుకోవడం మంచిది కాదు అభ్యర్థులు శాంతియుతంగా, వ్యక్తిగత దూషణలు లేకుండా ప్రచారం చేయాలి.కాలనీ వాట్సాప్ గ్రూపుల్లో లేనిపోని గందరగోళం చేయకూడదు. 6. ఓటింగ్ ప్రక్రియా సాధారణంగా రెండు విధానాలు: బ్యాలెట్ పేపర్ ఓటింగ్ సీక్రెట్ బ్యాలెట్ బాక్స్ ఓటర్లు ఒక్కొక్కరుగా వచ్చి రహస్యంగా ఓటు వేయాలి. 7. లెక్కింపు (కౌంటింగ్) ఎలెక్షన్ కమిటీ సభ్యుల సమక్షంలో ఓట్లు లెక్కించాలి. అభ్యర్థులకు కూడా కౌంటింగ్ దగ్గర ఉండే అవకాశం ఇవ్వాలి. 8. ఫలితాల ప్రకటన ఫలితాలు వెంటనే ప్రకటించి, నోటిస్ బోర్డుపైన పెట్టాలి.కొత్త కమిటీకి హ్యాండోవర్ చేయడానికి తేదీ నిర్ణయించాలి. 9. డాక్యుమెంటేషన్ మొత్తం ఎన్నికల ప్రక్రియను రికార్డ్ చేసి, ఫైల్‌గా ఉంచాలి.ఫలితాలు, ఓటర్ల లిస్ట్, నామినేషన్లుఅన్నీ భవిష్యత్తు కోసం సేవ్ చేసి ఉంచాలి.పై విధంగా జరిగితే చాలా ఆనందదాయకంగా ఉంటుంది కాలనీ, అలా కాని పక్షంలో కొత్త అసోసియేషన్లు పుట్టుకొస్తాయి అది అన్ని కాలనీలో జరిగేదే అని కాలనీవాసుల ఆవేదన

# మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించిన డా. సత్యం శ్రీరంగం

**ఇది కద నిజం,**
" స్వర్గీయ శ్రీ కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయం - పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం."
" నిబద్ధత, సౌమ్యత, ప్రజాసేవలో చెరగని ముద్ర వేసిన అజాతశత్రువు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య - టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం
ఈ రోజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్ లో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన టీపీసీసీ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , పీసీసీ ఉపాధ్యక్షులు టి. కుమార్ రావు , తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్



కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ , పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తదితరులు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సాధారణ జీవనం, ఉన్నత ఆచరణతో రాష్ట్ర రాజకీయాలకు నాణ్యత తీసుకువచ్చిన రోశయ్య ఆర్థిక క్రమశిక్షణ, ప్రజాహిత నిర్ణయాలు, నైతిక పాలనకు ప్రతీక. ఆయన నాయకత్వం, ప్రజల పట్ల ఉన్న ప్రేమ, పార్టీ పట్ల చూపిన అంకితభావం ఈ తరానికి కూడా మార్గదర్శకమే. ఈ రోజు ఆయనను స్మరించుకుంటూ, ప్రజాసేవ, బాధ్యతాయుత పాలన, నైతిక రాజకీయాలు అనే ఆయన చూపిన మార్గంలో కట్టుబడి ముందుకు సాగుతున్నాం అని అన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

**- గవర్నర్ ను కలిసి వినతి పత్రం అందజేసిన డబ్ల్యూ జె ఐ టి జే యు నేతలు**
**- సానుకూలంగా స్పందించిన గవర్నర్**

**ఇది కద నిజం,**
జర్నలిస్టులకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ని డబ్ల్యూ జె ఐ టీజేయు ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందించారు, దీనికి గవర్నర్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో జర్నలిస్టుల పక్షాన ప్రభుత్వం తగిన విధంగా



స్పందించకపోవడం, ముఖ్యంగా అక్రిడేషన్ కమిటీలో టీజేయు , డబ్ల్యూ జే ఐ కి ఐ అండ్ పి ఆర్ అక్రిడేషన్ కమిటీలలో ప్రాతినిధ్యం లేకపోవడం వంటి అంశాలను ప్రతినిధులు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు.జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు వంటి అంశాల్లో ప్రభుత్వం పక్షపాతం చూపుతోందని జర్నలిస్టులు అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు దీనిపై గవర్నర్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే వీటిపై సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. డబ్ల్యూ జే ఐ అధ్యక్షులు రాణా ప్రతాప్ టీజే అధ్యక్షులు కప్పర ప్రసాద్ రావు రాజు సుబ్బయ్య కర్ణాకర్ జనరల్ సెక్రటరీ రావికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు

**ఇది కద నిజం,**




యూనివర్సల్ 369 సెకండ్ మెగా ఇంటర్నేషనల్ ఛాంపియన్షిప్ లో శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ , గజ్వేల్ విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది ఈ సందర్భంగా శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, కరాటే మాస్టర్ చికోటి సుధాకర్ విద్యార్థినీ విద్యార్థులను అభినందించి అనంతరం వారు మాట్లాడుతూ, విద్యార్థిని విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ,ఆత్మ రక్షణకు కరాటే లో ప్రావీణ్యం సాధించాలని, ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థిని విద్యార్థులను అభినందించి, యూనివర్సల్ 369 సెకండ్ మెగా ఇంటర్నేషనల్ ఛాంపియన్షిప్ లో ప్రతిభ కనబరిచిన శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్, విద్యార్థిని విద్యార్థులు పలువురికి ఆదర్శమని అన్నారు.

# నరసన్నపేట 3 వ వార్డ్ బరిలో ఉడెం తిరుపతి రెడ్డి

**ఇది కద నిజం,**
సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం నరసన్నపేట గ్రామ మూడో వార్డు అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఉడెం తిరుపతి రెడ్డి మాట్లాడుతూ అందరికి నమస్కారం తెలియజేస్తూ మూడవ వార్డు అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్న నాకు మీ సంపూర్ణ సహకారం కావాలని నాకు కేటాయించిన గ్యాస్ పొయ్యి మీద మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని వార్డు సభ్యులను అభ్యర్థించారు, గ్రామం అభివృద్ధి కోసం నా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని



అన్నారు. నిస్వార్థంగా సేవ చేయడానికి మీ ముందుకు వస్తున్న నాకు మీ అమూల్యమైన ఓటు పొయ్యి గుర్తుకు వేసి నన్ను ఆశీర్వదించాలని కోరారు.

# శ్రీ దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్

**- కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్**

**ఇది కద నిజం,**



మీర్ పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ పరిధిలో గల వెంకటేశ్వరనగర్ షిరిడీ సాయిబాబా దేవాలయంలో గురువారం షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంబించిన స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ముఖ్య అతిథులను శాలువాలతో సన్మానించారు. ఉదయం కాగడ హారతి నిర్వహించి అనంతరం శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, ధుని పూజ,గురు చరిత్ర పారాయణం చేశారు. ఈ సందర్భంగా సంస్థాన్ ట్రస్ట్ వారు సుమారు 1500 మందికి పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంకాలం స్వామీ వారి సేవా పల్లకీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కె.నాదం చారి, సెక్రటరీ పివిజీ రాజారావు, కోశాధికారి పి.వీరభద్రరావు, రమేష్, వెంకటరమణ, సత్యనారాయణ, రమాదేవి, సురేష్ గౌడ్, విజయలక్ష్మి, సూర్య ప్రకాష్, బీఆర్ఎస్ నాయకులు చారి, బాలయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.